
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023
5
తిరుపతి





రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నేతలు

యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏలూరులో జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు టి.రఘుపతి రెడ్డి, ఎస్ఎస్.నాయుడుతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రతినిధులు ఎన్.మణిగండన్, జీవి రమణ, సిపి ప్రకాష్, కె.దీనావతి, ఎస్ పి బాషా, జిసికే ప్రసాద్, కె.రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్ మహేంద్ర, పంటపల్లి సురేష్, పిసి.బాబు పాల్గొన్నారు.

రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఉద్యమిద్దాం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్



వేదికపై అభివాదం చేస్తున్న వివిధ రాజకీయపార్టీల నేతలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్: వెనుకబాటు తనానికి మారుపేరుగా నిలిచిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్యంగా ఉద్యమిద్దామని వివిధ రాజకీయపార్టీల నేతలు పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాయలసీమ అభివృద్ధి సమస్యలపై జరిగిన చర్చాగోష్ఠికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ శాసనసభ్యులు ఎంఎ.గఫూర్, రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర విభజన చట్టం హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనందున రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. బుందేల్ ఖండ్ ప్యాకేజీ అమలు చేయకపోవడం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో కడప స్టీల్ ఫ్యాక్టరీని పొందలేకపోవటం, హైకోర్టును సాధించలేకపోవడం, నీటిపారుదుల ప్రాజెక్టులను పూర్తి చేసుకోలేకపోవడం వలన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కాలేకపోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మోటారు బావులుండగా ఒక్క రాయలసీమలోనే 12 లక్షల మోటార్ బావులు ఉన్నాయని వీటన్నింటికీ స్మార్ట్ మీటర్లు పెడితే రాయలసీమ రైతులకు అవి ఉరితాళ్ళు గా మారుతాయని అన్నారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి వాటి అమలుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి జరగాలన్నారు. హంద్రీనీవా సృజన స్రవంతి, గాలేరు-నగరి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌కు నీటిసమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1956 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ఆయా రాష్ట్ర బడ్జెట్లలో 10శాతం పైగా కేటాయించి ఖర్చుచేస్తే నేటి ప్రభుత్వం గత ఐదు బడ్జెట్లలో ఐదు శాతం లోపే కేటాయించి, మూడు శాతం మాత్రమే వ్యయం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులపట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరాశక్తత ఫలితంగా రాయలసీమ కరువు ప్రాంతంగా మారిందన్నారు. నేటి ప్రభుత్వం ఉత్పాదక రంగాలకు వెచ్చించకుండా అనుత్పాదక రంగాలకు వ్యయం చేయడం, అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం, అప్పులు చేసి ప్రజలను యాచకులుగా మారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రసంగిస్తూ రాయలసీమకు నీరు, నిధులు, నియామకాలు జరగాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి కారణంగా వేలాది మందికి ఉపాధి అందించే అమర్ రాజా ఫ్యాక్టరీ తెలంగాణకు తరలిపోయిందన్నారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నేత జి.ఓబులేష్ ప్రసంగిస్తూ వరదకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు రూ.10కోట్లు వెచ్చించలేకపోవడం వలన గత మూడు సంవత్సరాలుగా పునర్నిర్మాణం జరగలేదన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఏమేమి చేస్తారో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో తెలపాలన్నారు. తెలుగుదేశం పార్టీ నేత మాజీ శాసనసభ్యులు ఎం.సుగుణమ్మ ప్రసంగిస్తూ రాయలసీమ ప్రాంతంలో నీటిపారుదల ప్రాజెక్టుల కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసిన వ్యయంలో నాలుగో వంతు కూడా వైసిపి ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఈ చర్చాగోష్ఠిలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు జి.నరసింహ యాదవ్, వూక విజయకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఐ నేతలు రాధాకృష్ణ, పెంచలయ్య కాంగ్రెస్ పార్టీ నేత నవీన్ కుమార్‌రెడ్డి, జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దర్గాగా మఠం ఆస్తి కబ్జా

- మఠం హెచ్చరిక బోర్డును పీకేసిన వైనం
- మఠం అధికారులు.. ఒత్తిళ్లతో తలొగ్గుతున్నారా..?



మఠం అధికారులు బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశకి-తిరుపతి (మంగళం) : పది కోట్లు విలువ చేసే భూమి. తిరుపతి- చంద్రగిరి ప్రధాన మార్గానికి ఆనుకొని ఉన్న శ్రీ హథీరాంజీ మఠంకు చెందిన భూమిపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది. గత కొన్ని వారాలుగా కొంచెం కొంచెంగా మఠంకు చెందిన భూమిలో నిర్మాణాలు చేస్తూ పూర్తిస్థాయిలో తమ అనుభవంలోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. చంద్రగిరి మండలం పుదిపట్ల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా 9/1లో మఠంకు చెందిన భూమి ఉంది. ఈ భూమిపై తమకు హక్కు ఉందని కొందరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించి గ్రామ పంచాయతీ సెక్రటరీ, మండల తహాశీల్దార్‌లను సదరు స్థలంలోకి రాకుండా కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నట్టుగా సమచారం. అయితే ఇదే క్రమంలో మఠం అధికారులు ఈ భూమి తమదని బోర్డును ఏర్పాటు చేసినా ఆక్రమణదారులు దాన్ని పీకిపారేసి ప్రభుత్వ సెలవు రోజుల్లో అక్రమ కట్టడాల వేగం పెంచారు. దీనిపై మఠం అధికారులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోవడంతో మఠం అధికారలకు దిక్కుతోచడం లేదు. బలమైన రాజకీయ శక్తులు దీని వెనుక ఉన్నాయని సమాచారం. రాజకీయ ఒత్తిళ్ళతో మఠం అధికారులు తలొగ్గుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. విలువైన మఠం భూమిని కాపాడడానికి మఠం అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు రాజకీయ జోక్యం ఉందనడానికి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయకపోవడమే తార్కాణం.



మఠం స్థలంలో నిర్మాణాలు చేపట్టిన దృశ్యం



రహదారి బాగు చేయండి సారు ... ?

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నాక్ కమిటీ సందర్శనకు వచ్చినప్పుడు అండర్ డ్రైనేజ్ వాటర్ పైప్లైన్ ఆర్కేయాలజీ విభాగం నుంచి క్యాంటీన్ ఎడి బిల్డింగ్ వరకు గుంతలు తవ్వారు. అనంతరం పైప్‌లైన్ సిద్ధం చేయడానికి కూడా ఎక్కువ సమయం తీసుకున్నారు. ఈ లోపల నాక్ కమిటీ సందర్శించి వెళ్లిపోయింది. రూసా నిధులలో భాగంగా వర్సిటీలో ఈ పనులను ప్రారంభించారు. ఇటీవల కాలంలో క్యాంటీన్, ఆంధ్ర బ్యాంకు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి వెళ్లే దారిలో గుంతను తవ్వి పైపును పూడ్చారు. అయితే సక్రమంగా గుంతను పూర్చకపోవడంతో, ఇటీవల వర్షం రావడంతో గుంతలు ఎక్కువైపోయయాయి. తరగతులకు హాజరయ్యే విద్యార్థులు, విధులకు హాజరయ్యే సిబ్బంది, క్యాంటీన్‌కి వచ్చే వ్యక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు దీన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత కాంట్రాక్టర్‌ని పిలిపించి పనిని పూర్తిగా చేయాలని వర్సిటీ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

సత్వ ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్స్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి కేంద్రంగా ఎటువంటి లాభాపేక్షను ఆశించకుండా డిగ్రీ, పిజీ అభ్యర్థులకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపై మంచి పట్టు సాధించేలా చేసి ఉపాధి అవకాశాలను అందిస్తోంది సత్వ ఇన్ఫోటెక్. అంతర్జాతీయంగా పెరుగాంచిన హెక్సావేర్ టెక్నాలజీ సంస్థ సత్వ ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్లేస్‌మెంట్స్ కార్యక్రమం ద్వారా మంచి ప్యాకేజీతో ఏదేని డిగ్రీ, ఏదేని పీజీ, బిటెక్ పాసైన వారికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని సత్వ ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీష్ కుమార్ కుప్పిరెడ్డి తెలిపారు. ఈ నెల 12న మదనపల్లి విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో, 13న పుత్తూరు కార్వేటినగరం రోడ్డులోని ఎస్‌వి పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ప్లేస్‌మెంట్స్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాదిలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో 17 కళాశాలలకు చెందిన వెయ్యి మందిలో 309 మందికి మల్టి నేషనల్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గిరీష్ కోరారు. మరిన్ని వివరాలకు సత్వ ఇన్ఫోటెక్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

తిరుపతి అబ్బాయి.. యుకె అమ్మాయి...

ఖండాంతరాలు దాటిన ప్రేమపెళ్లి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఇటీవల ప్రేమ పెళ్లిళ్లు ఖండాంతరాలు దాటుతున్నాయి. విదేశాల్లో ఉద్యోగాలు చేయడానికి వెళుత్తున్న మన తెలుగు కుర్రాళ్లు.. అక్కడి అమ్మాయిల ప్రేమలో పడుతున్నారు.. ఆ తరువాత పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని ఒక్కటవుతున్నారు. ఇదే తరహాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగ రీత్యా యునైటెడ్ కింగ్ డమ్ (యుకె)కు వెళ్ళిన తిరుపతి అబ్బాయి అజయ్ ఆ దేశ పౌరురాలు సిమోనెతో ప్రేమలో పడ్డాడు. పెద్దల అంగీకారంతో ఖండాంతరాలు దాటిన ఈ ప్రేమ పెళ్లికి టీటీడీ శ్రీపద్మావతీ కళ్యాణ మండపం బ్లాక్ -2 వేదికైంది. పెద్దల సమక్షంలో వీరి వివాహం హిందూ సంప్రదాయం ప్రకారం ఆదివారం వేడుకగా జరిగింది. వివాహ వేడుకకు తుడా ఛైర్మెన్ హాజరు... తనకు చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీ కుమారుడు అజయ్.. అంతే కాకుండా పెళ్లికొడుకు స్నేహితుడు కావడంతో వివాహానికి తుడా ఛైర్మెన్ హాజరయ్యారు. వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మరో తనయుడు హర్షిత్‌రెడ్డి కూడా వివాహానికి హాజరయ్యారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ అలిపిరి డిపోలో ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, ఈ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తులసిరామ్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే.వేణుగోపాల్ కోరారు. శనివారం తిరుపతిలో ఉన్న అన్ని డిపోలను వారు సందర్శించి కార్మికుల వద్దకు వెళ్లి సమస్యలు గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఆదివారం ఉదయం యశోదనగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీరామ్, వేణుగోపాల్ మాట్లాడుతూ అలిపిరిలో ఎలక్ట్రికల్ బస్సు డ్రైవర్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని దాదాపు 250 మంది కార్మికులకు వసతి సౌకర్యం కూడా లేకుండా ఉందని, కనీసం వాళ్లు బాత్రూం వెళ్లాలన్నా పడుకోవాలన్నా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. (టిఎ) తనిఖీ అధికారుల వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. టీం మిషన్ సాంకేతిక లోపాల వల్ల టికెట్టు కొట్టినప్పుడు ఖాళీ టికెట్ ప్రింట్ లేకుండా వచ్చేస్తే అందులో పెన్నుతో రాస్తే ఎందుకు పెన్నుతో రాశావని అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఒక మనిషి టికెట్ ఎంతైతే ఉందో దానికి 10రెట్లు అదనంగా ఫైన్ విధిస్తున్నారని కార్మికుడు తీవ్రఇబ్బందిని ఎదుర్కోవాల్సి వస్తున్నదని తెలిపారు. ఈ సాంకేతిక కారణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కార్మికులకు 141 కార్డు టైమింగ్ ఇవ్వాలని, డే డ్యూటీ అయితే ఎనిమిది గంటలు, నైట్ డ్యూటీ అయితే నైట్ అలవెన్స్ ఇవ్వాలని, ఘాట్ రోడ్డు స్టీరింగ్ అలవెన్స్ ఇవ్వాలని, టీమ్ డ్యూటీ చేసే వాళ్లకు టిం అలవెన్స్ ఇవ్వాలని తెలిపారు. క్లీనింగ్ స్విపింగ్ శ్రామిక్‌లో పనిచేస్తున్న అందరికీ కూడా ఈఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని, బస్సు పాసులు అందరికీ ఇవ్వాలని, పాత కాంట్రాక్టర్ హయాంలో కట్ అయిన పిఎఫ్ డబ్బులు కొత్త కాంట్రాక్టర్ వచ్చిన తర్వాత కూడా కార్మికుల అకౌంట్లో జమ అయ్యే విధంగా చూడాలని కోరారు. అలాగే వీక్లీ ఆఫ్‌లు ఇవ్వాలి, కనీస వేతనాన్ని అమలు చేయాలని, తిరుపతి డిపోలో చెత్తను కూడా స్లీపింగ్ క్లీనింగ్ వాళ్ళ దగ్గరే తీస్తున్నారని, డిపో మేనేజర్ మున్సిపల్ వాళ్ళతో మాట్లాడి మున్సిపాలిటీ వర్కర్ల దగ్గర చెత్తను తరలించే కార్యక్రమాన్ని చేయాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సోమవారం ఉదయం అన్ని డిపో మేనేజర్లకు వినతిపత్రం ఇవ్వనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేత టి.సుబ్రహ్మణ్యం, భాస్కర్ పాల్గొన్నారు.

క్షత్రియ భవన నిర్మాణానికి కృషి

బిల్డింగ్ కమిటీ ఏర్పాటు



క్షత్రియ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బలరామరాజు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగర పరిధిలో క్షత్రియ భవన నిర్మాణానికి కృషి చేయనున్నట్లు రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘం సభ్యులు వెల్లడించారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘం కార్యవర్గ సమావేశం గౌరవ అధ్యక్షులు శివరామరాజు అధ్యక్షులు బలరామరాజుల ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా క్షత్రియ సోదరులు సత్యనారాయణ రాజు, సుదర్శన రాజు, కేఎల్.వర్మ మాట్లాడుతూ అతిత్వరలో తిరుపతి నగరంలో అన్ని వసతులతో కూడిన క్షత్రియ భవననిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడు నెలల్లో భూమిపూజ కార్యక్రమాన్ని శాస్త్రోత్తంగా నిర్వహించి రాష్ట్రంలోని అన్ని క్షత్రియ సంఘం నాయకులను ఆహ్వానించనున్నట్లు వారు తెలిపారు. బిల్డింగ్ నిర్మాణాన్ని పవర్ ప్రెసెంటేషన్ ద్వారా ప్రభాకర్ రాజు వివరించారు. రాజుల ఐకమత్యంతో క్షత్రియ భవన నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. బిల్డింగ్ కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు కార్యదర్శి నారాయణ బాబురాజు, డాక్టర్లు రవిరాజు, శ్రీధర్ రాజు, బాలరాజు, వీరేంద్ర వర్మ, మోహన్ రాజు, శ్రీధర్ వర్మ ప్రసంగించారు. అనంతరం సోషల్ టెక్ రీసెర్చ్ ఫౌండేషన్ రీజనల్ కోఆర్డినేటర్ సుకుమార్ రాజు మాట్లాడుతూ ఎస్‌టిఆర్ఎఫ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. క్షత్రియుల ఐక్యత కోసం వారి ప్రగతి కోసం చేపట్టిన క్షత్రియ గణనను రాష్ట్రవ్యాప్తంగా 300 మంది పైగా ఎన్యుమరేటర్లతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ, కోస్తా ఆంధ్ర ఈస్ట్, వెస్ట్ గోదావరి, భీమవరం తదితర ప్రాంతాలలో 70శాతం పైగా క్షత్రియ గణన జరిగిందని, రాయలసీమలో 30 నుంచి 40 శాతం మాత్రమే జరిగిందని వివరించారు. ఇందుకు స్థానిక క్షత్రియ నాయకులు సహకరించాలని కోరారు. 20కి పైగా పలు అంశాలలో రాజుల అభివృద్ధి కోసం సేవలు అందించనున్నట్లు తెలిపారు. తదుపరి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, డాక్టర్ బాలరాజులను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.

వనభోజనాలకు విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కార్తీక మాస పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో స్థానిక భరద్వాజతీర్థంలో ఆదివారం నిర్వహించిన వనభోజనాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్త మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు భక్తులకు వనభోజనాలు వడ్డించారు. సమతా సమరసతకు ప్రతీకగా నిలిచే వనభోజన కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని అతిథులు అన్నారు. డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య, ఏఈఓ ధనపాల్, లోకేష్‌రెడ్డి, సతీష్ మాలిక్, డిఈ శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీహరి, విజయ సారథి, నాగభూషణం, ఏఈ రాజేశ్వరి పాల్గొన్నారు.




గౌడ కులస్తుల వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న యార్లపల్లి గోపి

తిరుపతి టౌన్: బీసీలు రాజ్యాధికార దిశగా పోరాడినపుడే వెనుకబడిన వర్గాలు వృద్ధిచెందుతాయని ప్రముఖ బీసీ తత్వవేత్త విజిఆర్. నారగోని అన్నారు. పిఎల్ఆర్ కళ్యాణమండపం ముక్కోటిలో ఆదివారం తిరుపతి జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్ష్యుడు యార్లపల్లి గోపీనాథ్ గౌడ్, తిరుపతి గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్తీకగౌడ వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వికాస్ మాసపత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు డి.కుమార్ స్వామీ, రాష్ట్ర నాయకులు తిరగాల చిరంజీవి గౌడ్, అలాగని బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలగాని ఆనందబాబు, ఈడిగ కార్పొరేషన్ ఛైర్మన్ శాంతి కుమార్ దంపతులు, చిత్తూరు జిల్లా అధ్యక్షులు మద్దిలేటి కృష్ణమూర్తి, చింతమని ఆనంద్, మునిశేఖర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్

సీఈవోగా జెసి బాలాజీ బదిలీ



బదిలీపై వెళ్తూ డిఆర్ఓకు బాధ్యతలు అప్పగిస్తున్న జెసి డీకే బాలాజీ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టరు డికే బాలాజీ ఆదివారం బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోగా జెసి డికే బాలాజీ బదిలీ అయిన నేపథ్యంలో జెసి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. తదుపరి రెగ్యులర్ జెసి నియమించబడే వరకు డిఆర్ఓ పెంచల కిషోర్ ఇంఛార్జి జెసిగా కొనసాగనున్నారు.

సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యం

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కృత్రిమ మందుల వాడకం ద్వారా వచ్చే దిగుబడి కంటే సేంద్రియ వ్యవసాయం ద్వారా వచ్చే పంట ఆదాయం అధికమనీ, రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సూచించారు. స్థానిక ఏపీ సీడ్స్‌లో ఐపీటీడీ ఆధ్వర్యంలో సుస్థిర వ్యవసాయంపై అవగాహన కల్పించారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఐపిటిఎఫ్ శాస్త్రవేత్త డాక్టర్ మోహన్ కృష్ణారెడ్డి, ఏపీ గొర్రెల, మేకల పెంపకదారుల ఫెడరేషన్ ఛైర్మన్ ప్రకాష్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన పురుగు మందుల సూత్రకర్ణ పద్ధతుల ప్రచారంపై రైతులకు అవగాహన సదస్సు, శిక్షణ శిబిరం నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని అన్నారు. సేంద్రియ వ్యవసాయంతో పండించే పంట వల్లనే మనమందరం ఆరోగ్యంతో జీవించగలమని అన్నారు. గతంలో నా చిన్నతనంలో మా పెద్దవాళ్లు ఆవు పేడ ఎరువు, వృక్ష సంబంధ వ్యర్థాలు మురగపెట్టి ఎరువుగా తయారు చేసి దాన్ని పొలాల్లో చల్లి పంట పండించే వాళ్ళమనీ, దానివల్లనే ఈరోజు మన పెద్దలు ఆరోగ్యకరంగా 80 నుండి 90 సంవత్సరాలు జీవించగలిగారని చెప్పారు. ట్రస్ట్ బోర్డు దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉన్నం వాసు నాయుడు, జడ్పీటీసీ సుబ్బారెడ్డి, ముత్యాల పార్థసారథి, వయ్యాల కృష్ణారెడ్డి, బత్తి రెడ్డి, మణి నాయుడు,ప్రభాకర్ రెడ్డి,రమణయ్య యాదవ్, వడ్లతంగాల్ బాలాజీ ప్రసాద్ రె తదితరులు పాల్గొన్నారు.

అటవీ క్షేత్రస్థాయి అధికారుల


నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): తిరుపతి సర్కిల్ అటవీ క్షేత్రస్థాయి అధికారుల (ఎఫ్ఆర్ఓ) నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం తిరుపతి కరకంబాడి మార్గంలోని ఎర్రచందనం గోదాము ప్రాంగణంలో నిర్వహించారు. మొదటగా రాష్ట్రస్థాయి జాయింట్ సెక్రటరీ జెవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సాధారణ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షులుగా ఎం.మదన్ మోహన్‌రెడ్డి, కార్యదర్శిగా ఎన్.లక్ష్మీపతి, ఉపాధ్యక్షులుగా బి.సుదర్శన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పి.మాధవి, కోశాధికారిగా నారాయణ ఎన్నికయ్యారని అధికారులు తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం జిల్లా సిసిఎఫ్ నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసారు. నూతన కమిటీ సభ్యులను సిసిఎఫ్ అభినందించారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, కాజ్ వే పనులు

- సీఎం, కలెక్టర్ ఆదేశం
- రంగంలోకి అధికారయంత్రాంగం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తుపానుకు కొట్టుకుపోయిన రోడ్లు, కాజ్ వే పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి, పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. ఎమ్మెల్యే పిచ్చాటూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో తుపాను బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. పంటలు నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి జగనన్న ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. తుపాను నష్టం పై తాను ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతులకు తక్షణం స్పందించి అందరిని ఆదుకోవాలని, రోడ్లు కాజ్ వే లకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డికి జగనన్న ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు కలెక్టర్ సైతం కోతకు గురైన రోడ్లు, కాజ్ వేలకు తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారన్నారు. విద్యుత్ సమస్యపై విద్యుత్ శాఖ సిఎండి నియోజకవర్గంలో పర్యటించి ప్రత్యక్షంగా తుపాను నష్టంపై ఆరా తీశారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఎస్ ఈ నియోజకవర్గంలోని ఏడి, ఏఈ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ యుద్ధ ప్రాతిపదికన నేలకూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాట్లు చేపట్టి విద్యుత్ ను పునరుద్ధరించారన్నారు. తుపాను కు దెబ్బతిన్న నారాయణవనం మండలం పాలమంగళం కాజ్ వే, పిచ్చాటూరు మండలం అడవి కండ్రిగ రోడ్డు, కేవీబీ పురం మండలం నీర్ పూడి కాజ్ వే, నాగలాపురం మండలం ద్వారకా నగర్ కాజ్ వే, సత్యవేడు మండలం విఆర్ కండ్రిగ కాజ్ వే, వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలం లలో కోతకు గురైన రోడ్లు, కాజ్ వే పనులు తక్షణం ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. వీటితో పాటు ఇతర తుపాను ప్రభావిత ప్రాంతాలలో ఏర్పడ్డ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు.



దెబ్బతిన్న రోడ్లు, కాజ్‌వేల మరమ్మతులు చేయాలని సీఎం జగన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా మానవ హక్కుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, లా డిపార్ట్‌మెంట్లో డా.మాధురి పరదేశి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉపకులపతి ప్రొఫెసర్ డి.భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, ప్రొఫెసర్ కె.అనురాధ, డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, ముఖ్య అతిథిగా సి.హెచ్. రాజగోపాలరావు, ఒకటవ అదనపు జిల్లా న్యాయాధికారి విచ్చేశారు. గుంటూరు, ఆన్లైన్ ద్వారా జూమ్ మీట్లో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. అనేక ఆచరణాత్మక విషయాలను చర్చించారు. భారతీయ శిక్షాస్మృతి, భారతీయ చట్టం, మానవ హక్కుల చట్టం,క్రిమినల్ ప్రక్రియ స్మృతి, వివిధ సెక్షన్స్ గురించి వివరించారు. అనేక న్యాయ దృష్టాంతాల గురించి మాట్లాడారు. వేగవంతమైన విచారణ,పోలీస్ కస్టడీ, జ్యుడీషియల్ కస్టడీ, ప్రాథమిక నిర్మాణం, న్యాయ సమీక్ష, 9వ షెడ్యూల్, కస్టోడియల్ మరణం,మానవ హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘన గురించి కూడా మాట్లాడారు. సీనియర్ ప్రొఫెసర్ డా. సీతా కుమారి మాట్లాడుతూ ఎలా ఈ మానవ హక్కులు అమలులోకి వచ్చాయని, అన్ని మానవ హక్కులు ఎలా ప్రాథమిక హక్కులు కావో వివరంగా చెప్పారు. విద్యార్థినులు తమ ప్రసంగాలతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సునీత కాణిపాకం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఇందిరా ప్రియ దర్శిని, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో మానవ హక్కులు, సామాజిక అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెడ్ అండ్ ప్రిన్సిపల్ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య జి. పద్మనాభం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో తోటి వారికి తోచిన విధంగా సహాయం చేస్తూ అందరూ సమానంగా జీవించాలని సూచించారు. ప్రతి ఒక మానవుడికి మానవ హక్కులు సమానంగా సంక్రమించాయని వాటిని ఉల్లంఘించే హక్కు ఎవరికీ లేదని సూచించారు. ముఖ్యఅతిథిగా వైస్‌లా కడప జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ జి. వెంకటనారాయణ విచ్చేశారు. మానవహక్కుల గురించి వివరించారు.



ఎస్వియూనివర్సిటీలో మానవహక్కుల దినోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న అతిథులు

మానవ హక్కుల అవగాహనపై వివిధ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ రంజిత్ కుమార్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

ప్రజాశక్తి -గూడూరు రూరల్: గూడూరు రెండవ పట్టణ పరిధిలో అడవయ్యకాలనీ లోని గాడ్ గ్రేస్ సొసైటీ నడుపుతున్న అనాథ శరణాలయంలోని నిర్భాగ్యులైన వృద్ధులు, పిల్లలకు శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ రొటేరియన్ డాక్టర్ శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో మాతృమూర్తి జ్ఞాపకార్థం చేస్తున్న పలుసేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతీ నెలా క్రమం తప్పకుండా అన్నదానంను స్థానిక బ్యూరో ఆఫ్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆదివారం భోజనం, స్వీట్స్, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో దాత మయూరి శ్యామ్ యాదవ్, కూరపాటి రవీంద్ర బాబు, ఆశ్రమ నిర్వాహకులు భాషాజాన్ పాల్ పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. పుత్తూ రు మున్సిపాలిటీ పరిధిలోని 72వ బూత్ నెత్తం గ్రామంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ'ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వర్తించే పథకాలను వివరించారు. మహిళలకు మహాశక్తి, రైతులకు అన్నదాత, బీసీలకు రక్షణ చట్టం, యువగళం ద్వారా నిరుద్యోగులకు భృతి, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం పట్ల మహిళలు, యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్‌ధనపాల్, 72వ బూత్ ఇన్‌ఛార్జ్ వినోద్ కుమార్ యాదవ్, యూనిట్ ఇన్‌ఛార్జి ఈశ్వర్ యాదవ్, ఐటీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గోపీనాథ్, వార్డు ఇన్‌ఛార్జి హేమాద్రి, గ్రామస్తులు చిరంజీవులు, నటరాజ రెడ్డి, గిరి పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అమరావతి ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమని కిడ్నీ బాధితులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు కోరారు. గూడూరు పట్టణంలోని అమరా వతి ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే వరప్రసాదరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలో ప్రైవేటు డయాలసిస్ కేంద్రం అమరావతి ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గోపాల్ రెడ్డి, సిపిఐ నాయకులు ప్రభాకర్ , శశి పాల్గొన్నారు.



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు



నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రత్యేక ప్రతిభా వంతులకు అండగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం నిలబడు తుందని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు ప్రజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి ప్రత్యేక ప్రతభావంతులకు చేయూతను నిర్వహించారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ప్రత్యేక ప్రతిభావంతులకు సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి ప్రత్యేక ప్రతిభావంతులకు చేయూత లో భాగంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారని ఆయన కుటుంబ సభ్యులు వాటిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ కుంభాభిషేకం

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని సొరకాయలపాలెం పంచాయతీ లోని చల్లవారిపల్లి ముత్యాలమ్మ ఆలయ కుంభాభిషే కాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్ర గిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానికి టిడిపి, జనసేన నాయకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పులివర్తి నాని పట్టు వస్త్రాలను అమ్మవారికి మంగళ వాయిద్యాలు, ఓం శక్తి నామస్మరణ నడుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు పులివర్తి నానిని దుశ్శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి, ఈతమాకుల ఉమాపతి నాయుడు, జనార్థన్ చౌదరి, మండల రైతు విభాగం అధ్యక్షులు పూజారి సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు కాయం చంద్రశేఖర్, మోహన్ యాదవ్, కొట్టే నరసింహారెడ్డి, రామిరెడ్డి, నాథముని యాదవ్, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.



ఆలయానికి వస్త్రాలు తీసుకెళుతున్న నాని

యుద్ధ ప్రాతిపదికన కాజ్‌వేలకు మరమ్మతులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు, పుత్తూరు టౌన్ : తుపాను ప్రభావంతో అరుణానది ఉధృతికి దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. ఆదివారం పీఆర్ ప్రాజెక్ట్ డీఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన మండలంలో తుపాను దెబ్బకు కొట్టుకుపోయిన తుంబూరు, పాలమంగళం నార్త్ కాజ్‌వేలను పరిశీలించారు. సుమన్‌కుమార్, సర్పంచ్ సాయిరవి చొరవ తీసుకుని పాలమంగళం నార్త్ కాజ్‌వేపై గ్రావెల్‌తో రాకపోకలకు సిద్ధం చేశారు. సుమన్‌కుమార్ రూ.10వేల రూపాయలు సాయం అందివ్వగా, సాయి రవి 30 ట్రాక్టర్ ట్రక్కుల గ్రావెల్‌ను కాజ్‌వేకు మరమ్మతులు చేసి ఆదివారం సాయంత్రానికి పూర్తి చేశారు. కొట్టుకుపోయిన తుంబూరు కాజ్‌వేపై ఇసుక బస్తాలతో రాకపోకలకు దారిని సిద్ధం చేయాలని సుమన్‌కుమార్ సూచించారు. అరుణానది ప్రవాహానికి వరుసగా మూడు సార్లు కోతకు గురయిన తుంబూరు కాజ్‌వేకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సుమన్‌కుమార్ డీఈ ప్రభాకర్ రెడ్డిని కోరారు.



అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

-బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం అనాసం పల్లి ఎస్టీ కాలనీ, మల్లీమడుగు ఎస్టి కాలనీ లలోని తుపాన్ బాధితులకు అమెజాన్, డొనేట్‌కార్ట్ సౌజన్యం తో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యం లో ఆదివారం బియ్యం, పది రకాల నిత్యావసర సరుకులు, దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షు లు జూలియన్ రాజు మాట్లాడుతూ డొనేట్‌కార్ట్, అమెజాన్ వారు తుఫాన్ బాధితులకు అండగా నిలిచారని తెలిపారు. గత వారం రోజులు గా ఏడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కూలి పనితోనే జీవనం సాగించే నిరుపేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇంతటి విపత్తు సమయంలో పేదలకు సహాయం చేసే బాధ్యతను ఆషా సంస్థకు ఇచ్చినందుకు డొనేట్‌కార్ట్, అమెజాన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ సుశీలమ్మ, గ్రామ పెద్దలు పురుషోత్తం రెడ్డి, మిథున్, మునిరత్నం, ఆశా వర్కర్ ప్రభావతి, ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, ఆషా సిబ్బంది శ్రీనివాసులు, బాలరాజు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

ఏర్పేడు:ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామపంచాయతీలోని గిరిజన కాలనీలో మిచుంగ్ తుపాను వల్ల ఇబ్బందులు పడిన గిరిజనులకు నిత్యావసర సరుకులు అందించారు. ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని ఇబ్బందికర పరిస్థితుల్లో వారికి అండగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో వారికి 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఏర్పేడు ఇన్చార్జి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మేర్లపాక సర్పంచ్ కే. గంగాధర్ నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రభాకర్ రెడ్డి , వాలంటీర్లు, వార్డు మెంబర్లు , గ్రామ ప్రజలు అందరూ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజనులు ముఖ్య మంత్రి జగనన్నకు, ఎమ్మెల్యే మధన్నకు రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.



ఏర్పేడులో

వ్యవసాయ విద్యుత్ కొనసాగింపునకు షరతులు

- విద్యుత్ కార్యాలయంలో అప్లికేషన్ లభ్యం
- మూడు రోజుల్లో విద్యుత్ సర్వీస్ మార్చుకోవాలి
- లేకుంటే ఉచిత విద్యుత్ రద్దు

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఉచిత వ్యవసాయ విద్యుత్ సర్వీస్ ను వినియోగించే రైతులు వారి పేరుపై బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, మీ పేరు మింద ఉన్న భూమి పాస్ బుక్ జెరాక్స్,ఆధార్ జెరాక్స్ ఈ మూ డు పత్రాలు ఆయా మండల విద్యుత్ శాఖ కార్యా లయం లో అప్లికేషన్ తీసుకుని మూడు పత్రాలు జతచేసి సంతకం చేసి అందజేయాలి.

రైతులకు షరతులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచిత వ్యవసాయ విద్యుత్ సర్వీస్ ను వినియోగించే రైతులు పేరుపై వున్న బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, భూమి పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకుని ఆన్ లైన్ చేస్తారని తెలిపారు. అంతే కాకుండా వేరే వారి పేర్లపై విద్యుత్ సర్వీస్ వినియోగించే రైతు లు పత్రాలు అందించాలి. రైతులు మండల విద్యుత్ శాఖ అధికా రులను కలిసి వివరా లు తెలు సుకొని అప్లికేషన్ కు రైతులు పేరుపై వున్న బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, భూమి పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్ జతచేసి అందజేసి మూడు రోజుల్లో వారి పేరుపై విద్యుత్ సర్వీస్ మార్చుకోవాలి కోరారు. ఆలా చేయ కుండా ఉంటే విద్యుత్ సర్వీస్ లు రద్దు చేస్తామని ఆయన తెలిపారు.



మేమొస్తాం.. భయపడకండి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చేది టీడీపీ ప్రభుత్వమేననీ, తుపాను బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి భరోసా ఇచ్చారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె 34వ వార్డులో పర్యటించారు. తుపాను కారణంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. తుపాను బాధితులను ఆదుకోవడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మరో మూడు నెలల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనీ, అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో బొజ్జల సుధీర్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సత్ర వాడ ప్రవీణ్, కంఠా రమేష్, ముని రాజా నాయుడు, పోలూరు శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రిషితారెడ్డి

పాలకులను సరిచేయాల్సిన బాధ్యత ప్రజలదే..

మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాజ్యాంగాన్ని పక్కనపెట్టి తనకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్న పాలకులను సరిచేయాల్సిన బాధ్యత ప్రజలదేనని మాజీచీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం సిటిజన్స్ ఫర్ డెమొక్రసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా పాలన లేకపోతే పలు ప్రమాదాలు వాటిల్లుతాయి అన్నారు. చట్టసభల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తితో చర్చలు జరగాలని పేర్కొన్నారు. మనం ఎన్నుకొన్న ప్రజా ప్రతినిధులు చేస్తున్న తప్పులను కచ్చితంగా ఎత్తితూపాలని అన్నారు. మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరబడిందన్నారు. దాన్ని ప్రశ్నించేందుకే సిఎఫ్‌డి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. అవకతవకలు సవరించి ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విఫలమయ్యారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూలేని రీతిలో ఓటర్ల జాబితాపై విమర్శలున్నాయి అని గుర్తు చేశారు. ఓటర్ల జాబితా తయారీకి వినియోగించిన సిబ్బంది వ్యవహారమే దీనికి కారణమని తెలిపారు. ఓట్లను గంపగుత్తగా తొలగించకూడదన్న కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు రాష్ట్రంలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రాష్ట్రానికి మరోసారి ఎందుకు కావాలి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సిబ్బందితో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ తీరును సీఎఫ్ డి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లిందని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం సలహాదారులను నియమించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంవి రావు, భీమని ప్రసాద్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కృష్ణారావు, లక్ష్మణ రెడ్డి, రఘు, పల్గుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఐఎఎస్ అధికారులు



స్వీపర్స్ కి 15 నెలల జీతాలు ఇవ్వాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మున్సిపల్ స్వీపర్స్‌కి పెండింగ్‌లో వున్న 15 నెలల జీతాన్ని ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు. స్థానిక పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ స్వీపర్స్ మాట్లాడుతూ గూడూరు మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న 17 మంది స్వీపర్ల వద్ద ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు పని చేయించు కొని స్వీపర్స్ కు గత 15 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, సంబంధిత అధికారులు అయిన మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లాలని ఆయన ఎంఈఓ ని అడగాలని చెప్పారని తాము ఎంఈఓ ని అడగగా ఆయన కమిషనర్ ని అడగాలని సమాధానం ఇచ్చారన్నారు. ఇలా ఒకరిపై మరొకపు చెప్పుకొని, సంబంధిత అధికారులు బాధితులను తిప్పుకుంటున్నారన్నారు. ఆదివారం తిరుపతి జిల్లా గూడూరులో సమావేశంలో ఉన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందివాసి నాగరాజు దృష్టికి వారి సమస్యలను తీసుకెళ్లామన్నారు. వెంటనే ఆయన స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో స్వీపర్లు కె.విజయమ్మ, టి.వెంకట రమణమ్మ, కె.శేషమ్మ, ప్రమీల,ఆయుష, రాజమ్మ, పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్, జోగి శివకుమార్, పామంజి మణి, ఏ ప్రసాద్, బి చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రజలు హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -రేణిగుంట: ప్రజలు తమ హక్కులను వినియోగించుకోవాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తిరుపతి జిల్లా చైర్మన్ వల్లూరి రాజశేఖర్ స్పష్టం చేశారు. ఆదివారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా చైర్మన్ వల్లూరి రాజశేఖర్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హక్కుల పరంగా సమస్యలు ఎదురైతే తనను సంప్రదించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తున్న నగర మేయర్ అభినయ రెడ్డి, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరుపతి ఎంపీ గురుమూర్తి హ్యూమన్ రైట్స్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



బియ్యపు మధును గెలిపిద్దాం: వైసిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్‌సిపి అభ్యర్థిగా ఉన్న బియ్యపు మధుసూదన్ రెడ్డిని అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. స్థానిక రోటరీ క్లబ్ లో ఆదివారం బీసీ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ సిపాయి పాల్గొని మాట్లాడుతూ ఎన్టీ రామారావు తర్వాత రాష్ట్రంలో గతంలో ఏ పార్టీ చేయని విధంగా బీసీలకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 64 శాతం రిజర్వేషన్లు ఇచ్చి రాజ్యాంగ పదవులను కట్టబెట్టారని గుర్తు చేశారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి బీసీలను గుర్తించి నామినేట్ పదవులను అత్యధికంగా బీసీలకు కేటాయించాలని కొనియాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు ఎమ్మెల్సీ పదవులను బీసీలకే కేటాయించి వారి ఆత్మాభిమానాన్ని కాపాడిన ఏకైక పార్టీ వైసీపీ అనీ, వచ్చే ఎన్నికల్లో బీసీలంతా మధుసూదన్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, పురుషోత్తం గౌడ్, బుజ్జి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు రెడ్డి, వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు గూడూరులో

I.P.NO. 41 / 2022

1. Nelavalli Venkata Subba Naidu
2. Chinthakani Kiran Babu ....Petitioners

Vs

1. Nelavalli Rajesh
2. Nelavalli Gomathi .... Respondents

To

1. Nelavalli Rajesh, Son of Nelavalli Muni Raja.
2. Nelavalli Gomathi, W/o Nelavalli Rajesh

Both are residents of D.Nos. 16-2-20, 16-2-21, 5 th Street, Rajagopalapuram, Naidupet Town and Mandal, Tirupati District.

నోటీసు

ఇందు మూలముగా పై తెలిపిన రెస్పాండెంట్స్ కు తెలియచేయుట ఏమనగా పై దావాలోని పిటిషనర్స్ రెస్పాండెంట్స్ మీద రుణదాత దివాలా పిటిషన్ చేసియున్నారు. పై దావా మీ నోటీసుకు గాను తేదీ. 27-12-2023 కు వాయిదా వేసి యున్నారు. కావున ఆరోజు మీరు ఉదయం 10.30ని.పై కోర్టులో హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకోనేది లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు,
యం. సోమశేఖర్, బి.ఎస్సీ, బి.ఎల్.,
అడ్వకేట్. నాయుడుపేట.

సొంత లాభం కొంత మానుకో: మురళీ నాయుడు

ప్రజాశక్తి -తొట్టంబేడు: ప్రతి మనిషి సొంత లాభంలో కొంత పేదల కోసం ఖర్చు చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు పిలుపునిచ్చారు. ఆ పార్టీ బీసీ సెల్ విభాగం మండలాధ్యక్షుడు సురేంద్ర యాదవ్ ముద్దుల కుమార్తెలు హృతిక, మైథిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని శివనాథపురం అమ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్దులకు పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీ నాయుడు మాట్లాడుతూ తన కుమార్తెల జన్మదినం రోజు పేదలకు అన్న దానం చేసిన సురేంద్రను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమకున్న దాంట్లో పేదలకు సాయం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సత్ర వాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురేంద్రను ఆదర్శంగా తీసుకుని పేదలకు సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు భూలక్ష్మి, టీడీపీ నాయకులు తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు. లోకనాథం, కిషోర్, దొరబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.



బాధితులకు అండ: జనసేన

ప్రజాశక్తి -వరదయ్యపాలెం : మండలంలోని పులి వెల్లం గ్రామ పంచాయతీలో స్థానికుడు దళితుడు నాగేంద్ర ఇల్లు తుపాన్ కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయి ఆర్థికంగా నష్టం జరిగింది. ఇది తెలుసుకున్న జనసేన వరదయ్యపాలెం మండలం కమిటీ అధ్యక్షులు చిరంజీవి యాదవ్ నాగేంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అదివారం అందించారు. ఈ సంద్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి న్యాయం జరిగేలా వరదయ్యపాలెం జనసేన మండల కమిటీ పోరాడుతుందన్నారు. అన్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజలకు ఎక్కడ సమస్య వస్తే ఆసమస్యను పరిష్కరించడానికి జనసేన మండల కమిటీ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు, ఈ సమస్య పై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను అదుకోవలని కోరారు. ఈ కార్యక్రమం లో శేఖర్, తులసి రామ్, కేశవ్ వెంకటేష్ జనసేన ప్రధాన కార్యదర్శి ముని రత్న, మహేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

గిరిజనులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి -తొట్టంబేడు: వర్షాలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని గిరిజనులు తెలియజేయడంతో కాసరం ఎస్టీ కాలనీలో పేదలకు దుప్పట్లు, పండ్లు ను పంపిణీ చేసిన నేషనల్ కన్స్యూమర్ రేట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి గిరిజన కాలనీలోని సుమారు 30 మంది కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో సమస్యలను తెలుసుకొని అధికారులకు తెలియజేసి త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, సంద్ర మహేష్, రోమాల గురువారెడ్డి, రోమాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంపూర్ణమ్మ, ప్రజా ప్రతి, ప్రతాప్, పరుశురాం, విజయ్, సుబ్బయ్య, రాము పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వాకర్సు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవి రాజు, ఎన్నికల అధికారి, న్యాయవాది గాలి రమేష్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గ సభ్యులుచే అధ్యక్షులుగా కేఎల్ మూర్తి కార్యదర్శిగా, ముని కృష్ణయ్య. ట్రెజరర్‌గా గుణశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దాము నాయుడు, ద్వారకనాథ్ శెట్టి, వాకర్ గా రఘునాథ రెడ్డి, కమిటీ సభ్యులుగా శంకు నాదం, సుధాకర్ శెట్టి, పదిమంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కేఎల్ మూర్తి మాట్లాడుతూ వాకర్స్ సభ్యులందరూ ఐకమత్యంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్ గవర్నర్ రావిళ్ళ మాధవ నాయుడు, కె కుప్పయ్య శెట్టి, చెంచయ్య, గోపికృష్ణ, మురుగేష్ న్ రెడ్డి, వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తిరుపతి X వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి వారి కోర్టులో

G.W.O.P. NO. 408 OF 2023

1. తిరుమల రామాచారి శేషాద్రి (మూర్ఛ రోగస్తులు)
   తండ్రి లేట్. తిరుమల రామాచారి
2. తిరుమల రామాచారి శ్రీనివాసులు(మూర్ఛ రోగస్తులు),
   తండ్రి లేట్. తిరుమల రామాచారి

నేచురల్ గార్డియన్ టి. లక్ష్మి, భర్త టి. శ్రీనివాసన్, డి.నెం. 1-6-6ఎ, కర్ణాల వీధి, తిరుపతి అర్బన్ మండలం, ...పిటిషనర్స్

మరియు

నిల్

జనరల్ నోటీసు

ఇందు మూలముగా యావన్మందికి తేలియజేయడమేమనగా 13-1-2005వ తేది చనిపోయిన లేట్ టి. రామాచారి మరియు 28-5-2012వ తేది చనిపోయి లేట్ టి. జానకమ్మ గార్ల కుమారులైన 1). టి. రామాచారి శేషాద్రి 2). టి. రామాచారి శ్రీనివాసులు ఉన్నారు. సదరు టి. జానకమ్మ 14-3-2007వ తేది క్రింద కనిన షెడ్యూలును డి.కెం. 57/బికె3/ 2007 విల్ ద్వారా సంక్రమించి పిటిషనర్స్ నేచురల్ గార్డియన్ అగు టి. లక్ష్మి అనుభవించుకొనుచున్నది. సదరు టి. శేషాద్రి, టి. శ్రీనివాసులు తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత వీరిద్దరు యోగ క్షేమములు తన అక్క సంరక్షంలో ఉంటున్నారు. సదరు టి. శేషాద్రి టి. శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితి బాగలేనందున, వైద్యపరీక్షల కోసం మరియు జీవనము పోషించుటకు పైకము అవసరంగా ఉంటున్నది. సదరు షెడ్యూలు దాఖలు నందు ఎలాంటి ఆదాయము సంక్రమించడం లేదు. అందు నిమిత్తము సదరు షెడ్యూలును ఎవరికైనను మంచి ధరకు అమ్మివేసి ఏదేని నేషనల్ బ్యాంకులో డిపాజిట్టు వేసి సదరు పైకమునకు వచ్చు వడ్డీతో శేషాద్రి, శ్రీనివాసులు సంరక్షించవలసి యున్నది. సదరు షెడ్యూలును ఎవరికైనను అమ్మివేయుటకు ఎవరికైన ఏలాంటి అభ్యంతరములు ఉన్న 28-12-2023 వ తేదిపై కోర్టు నేరులో నైను వకీలు ద్వారా అయినను హాజరై మీకు గల అభ్యంతరములు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపవలసినది. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్, తిరుపతి రిజిస్ట్రేసన్ డిస్ట్రిక్, తిరుపతి సబ్.డి. తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్, కపిలతీర్థం నుండి అలిపిరికి పోవు కొండ రోడ్డు దక్షిణ పార్శ్వం లోపల ఎ.పి.హెచ్.బి.కాలనీ, టి.యస్.నెం. 10/2 మరియు 10/3 ర్లు గల భూమిలో నాకు గల జాగా మరియు సదరు జాగాలో 6-9-1256 నెంబరు గల ఆర్.సి.సి.లాదు ఏ.సి.సి. రేకులు ఇంటికి హద్దులు, కొలతలు

వివరములు :

తూర్పు : హౌసింగ్ బోర్డు రోడ్డు,
పడమర : ఎమ్.ఐ.జి. హెచ్ నెంబరు 15 ఇల్లు
ఉత్తరం : కపిలతీర్థం నుండి అలిపిరికి పోవుకొండ రోడ్డు దక్షిణ పార్శ్వంలో అనుకొనియుండు రేకుల షెడ్డు
దక్షిణం : సందు
యా హద్దులు మధ్యన
తూర్పు – పడమర అడుగులు 19.5 లేక మీ. 5.795,
ఉత్తరం – దక్షిణం అడుగులు 37.5 లేక మీ. 11.437
మొత్తం చ.అ.731.25లు లేక చ.గ. 81.25లు గల జాగా.
వాయిదా: 28-12-2023

యన్. మనోహర్
పిటిషనర్స్ తరపు న్యాయవాది, తిరుపతి.